
# పవిత్రమైన పెళ్ళి

సి. ఆనందారామం



ఫస్ట్‌క్లాసు పాసయిన వకుళ సంతోషానికి పట్ట పగ్గాలు లేవు. అసలు తను పాసవగలనని అనుకోలేదు వకుళ...

పెద్దత్తకు జబ్బుచేసి హాస్పిటల్లో ఉంటే రోజూ సాయంత్రం కేరియర్ తీసికెళ్ళవలసి వచ్చేది. చిన్నత్తకు పురుడొచ్చింది... అమ్మకి సరేసరి కీళ్ళ వాతం... కొన్నాళ్ళు పొద్దున్నా, సాయంత్రం వంట తనే చెయ్యవలసి వచ్చేది...

పాపం! అమ్మమ్మ మాత్రం మంచంలో పడుకుని 'ఇంత చిన్న వయసులో నీ కెన్ని యాతనలే!' అని కళ్ళ నీళ్ళు తెచ్చుకునేది. అంతకంటె ఆవిడ మాత్రం ఏం చెయ్యగలదు?

ఈ గొడవ లన్నింటి మధ్యా అసలు పుస్తకం పట్టుకోవటానికే వీలుపడేదికాదు- ఏం చదివిందో, ఎలా చదివిందో ఆ భగవంతుడికే తెలియాలి... హాస్పిటల్‌కి వెళుతూ బస్‌లో చదివేది... కూర ముక్కలు కలియబెడుతూ చదివేది. అత్తకు కాళ్ళరాస్తూ చదివేది...అయినా పాసయింది. ఫస్ట్‌క్లాసులో పాసయింది...

పేపర్ చేతిలో పట్టుకుని తన నంబర్ మళ్ళీ మళ్ళీ చూసుకొంటున్న వకుళ దగ్గరకు పరుగెత్తుకుంటూ వచ్చింది శారద...

ముందు వకుళ నోట్లో స్వీట్ పెట్టి ''నేను సెకండ్ క్లాసులో పాసయ్యాను. దొంగ! పరీక్షలు రాసి ఎప్పటి కప్పుడు ఏడ్చేదానివి-ఫస్టుక్లాసులో పాసయ్యావు" అంది.

వకుళ సంబరంగా నవ్వి, "ఇప్పటికీ నాకు నమ్మకం కలగటం లేదు" అంది మళ్ళీ పేపరు చూస్తూ...

"నీలాంటి వాళ్ళు అంతేలే! మరి స్వీట్ ఏదీ?"

బిత్తరపోయి బేలగా చూసింది వకుళ. శారద నాలుక కరచుకుంది...

''అయామ్ సారీ! అందరినీ అడుగుతున్నట్లు అలవాటుగా అడిగేశాను. ఏమీ అనుకోకు ... మరి కాలేజీలో చేరుతున్నావా? త్వరగా అప్లికేషన్లు పెట్టు - ఆలస్యం చేసావంటే క్లాస్ వచ్చినా, సీట్ రాదు..." అనేసి మిగిలిన స్నేహితుల దగ్గరకు పరుగు తీసింది శారద.

కాలేజీలో చేరాలి! వకుళ పంచ ప్రాణాలూ కాలేజీలో చేరాలనీ, ఇంకా పైకి చదవాలనీ అలమటించి పోతున్నాయి. సాయంత్రం మావయ్యని అడగాలి! మావయ్యని ఏం అడగాలన్నా ప్రాణం పోయినట్లే ఉంటుంది... ఒక పురుగుని చూసినట్లు చూస్తూ మొహం చిట్లించుకుని వంద సణిగి అడిగిన దానిలో సగం ఇస్తాడు - అయినా గత్యంతరం లేదు - అతణ్ని అడిగితే తప్ప గడిచే మార్గం లేదు. రెండే రెండు పరికిణీలతో సంవత్సరమంతా గడుపు కొస్తుంది. మధ్యాన్నం తిన్నా తినకపోయినా ఆకలి నిగ్రహించుకొంటుంది. పుస్తకాలూ, పెన్‌లూ, వాళ్ళవీ వీళ్ళవీ అడిగి ఎలాగో గడువుకొస్తుంది - అయినా మావయ్యని అదీ, ఇదీ అడక్క తప్పదు... వెధవ జీవితం...

భయపడుతూనే మావయ్యను అడిగింది... ''మావయ్యా! కాలేజీలో అప్లికేషన్ పడెయ్యనా?" అని- అక్కడే ఉన్న పెద్దత్తయ్య ఏదో విడ్డూరం వింటున్నట్లు గుండె బాదుకుంటూ, ''ఏమిటీ? చదువుతావా? చదివి ఎవర్ని ఉద్ధరించాలి తల్లీ! ఎంత చదివినా పెళ్ళి చెయ్యక తప్పదుగా! మాకు అదొక తద్దినం ఉండనే ఉంది. ఏదో ఒక సంబంధంచూసి పెళ్ళి చేసేయ్యాలను కొంటూ ఉంటే, ఇంకా చదువు లేమిటి? అడగటానికైనా నోరు రావాలి!"

'పెళ్ళి...' ఆ పేరే కొత్తగా విడ్డూరంగా వినిపించింది వకుళకు...ఆ నాటి వరకూ ఆ పేరు ఏనాడూ మనసులోకి రాలేదు. తనకు పెళ్ళా? పెళ్ళి అంటే ?—

వకుళకు తియ్యని ఊహలూ, వెచ్చని పులకరింతలూ ఏమీ రాలేదు. ఆ పసి మనసు ఛ!ఛ! అనుకుంది, భయంతో, చీదరతో....

ప్రయోజనం లేదని తెలిసీ, తల్లిదగ్గిర మరొకసారి తన మనసు బయపడేసుకుంది.

"అమ్మా! నేను కాలేజీలో చేరి చదువుతాను."-

ఆ తల్లికీ కూతురిని చదివించాలనే ఉంది. కానీ తన నిస్సహాయ స్థితికి ఎవరిమీద కోపం తెచ్చుకోవాలో తెలియక కూతురిమీదే విరుచుకుపడింది....

"ఏవిటే! బుద్ధిఉండి అడుగుతున్నావా? బుద్ధిలేక అడుగుతున్నావా? మీనాన్న అన్నివిధాలా ఇలా అన్యాయం చేసి పోయింతరువాత ఇంకా మనకి ఆశలేమిటి?" అని ఏడుపు మొదలు పెట్టింది.

ఇదివరలో తల్లి ఎప్పుడు ఏడుపు మొదలుపెట్టినా, వకుళమనసు కరిగి పోయేది. సాధ్యమైనంతవరకూ తల్లిని ఓదార్చాలనే ప్రయత్నించేది.

వకుళకు ఇద్దరు తమ్ముళ్ళు, ముగ్గురు చెల్లెళ్లు... ఇందరినీ, వాళ్ళ కర్మానికి వాళ్ళను వొదిలి తండ్రి ఎక్కడికో పరారి అయిపోయాడు...పాపం. వకుళ అమ్మమ్మ తన కూతురికి మంచి సంబంధమే, మంచి కట్నంతోనే చేసింది. కానీ ఆ ప్రబుద్ధుడు...వకుళ తండ్రి, ఆస్తి ఇష్టంవచ్చినట్టు తగలేసి దేశాలు పట్టి పోయాడు. గత్యంతరం లేని వకుళతల్లి పుట్టింటికి చేరుకుంది...వకుళ మావయ్యలిద్దరికీ మండిపోయింది బోలెడు కట్నాలు గుమ్మరించి పెళ్ళిళ్ళు చేసింది చాలక, మళ్ళీ ఈ గంపెడు సంసారాన్ని భరించాలంటే మాటలా? కానీ, తల్లి ముఖం చూసి ఏమీ అనలేక ఇంట్లో ఉంచుకున్నారు. వకుళ అమ్మమ్మకి కూతురి స్థితి కష్టంగానే ఉంది. అయినా ఏం చెయ్యగలదు? తన కొడుకులు తన మీద కొద్దిపాటి గౌరవముంచి తోబుట్టువును ఈ మాత్రంగా ఆదుకుంటున్నదే మహాభాగ్య మనుకుంది. ఈ రోజుల్లో డబ్బు ముందు రక్త సంబంధాలు ఎవరు చూస్తున్నారు?

వకుళకు ఈ మధ్యనే,సావిత్రితోనూ, సుశీలతోనూ స్నేహాలు కలిసాయి. సావిత్రి తల్లినికూడా మొగుడు వదిలేసాట్ట. మరెవరినో పెళ్ళి చేసుకున్నాట్ట... అయినా సావిత్రి తల్లి వాళ్లపంచనా, వీళ్ళపంచనా చేరలేదు. ఆ వయసులో చదువు ప్రారంభించి మెట్రిక్ పాసయి మరో అయిదేళ్ళలో బి.ఏ కూడా పాస యింది. వయసు మీరిపోయిందని ఎవరూ ఉద్యోగం ఇయ్యకపోతే తనంతట తను ఒక కె జి. స్కూల్ ప్రారంభించి స్వయంకృషితో దాన్ని వృద్ధిలోకి తెచ్చింది. తన ముగ్గురు పిల్లలనూ లక్షణంగా పెంచుకొంటూ గౌరవంగా కాలం గడుపుతోంది సావిత్రి తల్లి... సుశీలకు చిన్న వయసులోనే భర్త పోయాడు. అంతగా చదువుకోలేదు. కొన్నాళ్లు పుట్టింట్లో ఉంది. కానీ... అక్కడ అందరూ అన్ని పనులూ చేయించుకుంటూ వంటలక్క కంటే హీనంగా చూస్తోంటే భరించలేక పోయింది. కూతురితోసహా బయటకొచ్చేసింది. అప్పడాలు చేసి అమ్ముకునీ, ఊరగాయలు అమ్ముకునీ, పెళ్ళిళ్ళకు పేరంటాలకూ వంటలుచేసీ, ఎలాగో కూతురిని చదివిస్తోంది.

తన తల్లికూడా వాళ్ళలా స్వతంత్రంగా బ్రతకడానికి ఎందుకు ప్రయత్నించకూడదూ? ఆ మాటే అనేసింది. "నాన్న వదిలేసాడని ఊరికే ఏడుస్తావు. అంతే! ఇక్కడ చేస్తున్న ఇంత చాకిరీ మరెక్కడైనా చేసుకుంటే మనకు గడవదా?"

తల్లి కళ్ళు పెద్దవిచేసి విచిత్రంగా చూసింది కూతురిని.

"ఏం మాట్లాడుతున్నావే! మావయ్యలు మనని బ్రతకనిస్తారా?"

"ఇప్పుడు బ్రతకనిస్తున్నారు మహా! ఇదీ ఒక బ్రతుకేనా!"

కూతురి ధోరణికి హడిలిపోయింది తల్లి.

"ఛ! ఛ! నోరుమూసుకో! అత్తయ్యలెవరైనా వింటారు." అని కసిరింది.

వకుళ మళ్ళీ నోరు మెదపలేదు. ఆ పద్నాలుగేళ్ల పసిమనసుకి తను ఏం మాట్లాడినా ప్రయోజనం లేదని అర్థమయిపోయింది. ఏం చెయ్యాలో మాత్రమే అర్థంకాలేదు.

"మా వకుళకు పెళ్ళి..." అని చెప్పింది తల్లితో శారద.

శారద తల్లికి వకుళ అంటే అభిమానం... వకుళ పరిస్థితి... ఆ అమ్మాయి మంచితనం... ముఖ్యంగా వకుళ తెలివితేటలూ, శారదకు ఎన్నో విధాల చదువులో సాయంచెయ్యటం... ఇవన్నీ శారద తల్లికి వకుళ పట్ల మంచి అభిప్రాయాన్ని కలిగించాయి. ఎన్నో సార్లు వకుళకు అనేక విధాల సాయం చేసింది.

శారద వకుళకు పెళ్ళి అనగానే తెల్లబోతూ "అప్పుడే పెళ్ళా!" అంది.

"అవును- పాపం, వకుళ ఏడుస్తోంది." బాధపడుతూ చెప్పింది శారద.

శారద తల్లి సాధారణంగా ఎవరింటికీ వెళ్ళదు. అందుకు కారణం లేక పోలేదు. శారద తల్లి వృత్తిలో ఉన్న వేశ్య- అయినా తన కూతుర్ని మాత్రం గృహిణిని చెయ్యాలని భగీరథ ప్రయత్నంచేసింది. శారద అదృష్టమో, ఆ తల్లి తపసో, తెలియదు కాని, బంగారు బొమ్మలాటి శారదను ఏ సంకోచాలూ లేకుండా అన్ని విధాలా యోగ్యుడయిన మాధవరావు శాస్త్రోక్తంగా పెళ్ళి చేసుకున్నాడు.

"మీరు చాలా సంస్కారభావాలు కల

వారు." అని శారద తల్లి ఎప్పుడైనా భర్తను పొగిడితే అతడు ఊరుకోడు.

"నీ మొహం! నాకు సంసారమనే మాటకు అర్థమయినా తెలియదు. నిన్ను చూసాను ఈ బంగారు బొమ్మను చెయ్యిజారి పోనియ్యకూడదనుకున్నాను. వెంటనే పెళ్ళి చేసుకున్నాను అంతే!'' అంటాడు నవ్వుతూ.

ఆ భార్యాభర్తలిద్దరూ చాలా అన్యోన్యంగా హాయిగా జీవిస్తున్నారు. అది చూసి సహించలేని అమ్మలక్కలు ఏదో ఒక విధంగా శారద తల్లి గతాన్ని త్రవ్వి కులం ప్రసక్తి తెచ్చి ఆవిడ మనసు తూట్లు పొడిచి సంతృప్తి పడాలని చూస్తారు. అందుకే శారద తల్లి ఎప్పుడూ ఇరుగు, పొరుగూ, ఎవరింటికీ వెళ్ళదు. తన భర్త, కూతురు, ఇదే లోకంగా గడుపుతోంది.

కానీ, శారద ''వకుళ పెళ్ళి" అన్నాక స్థిమితంగా ఉండలేక పోయింది... వకుళను చదివించటానికి కూడా శక్తి లేక చదువుమానిపించిన ఆ తల్లి పెళ్ళిచెయ్యగలుగుతుందా? ముక్కుపచ్చలారని వకుళకు పెళ్ళేమిటి? పాపం, శారదలాంటిదే కదూ, వకుళ కూడా!...

సంగతేమిటో తెలుసు కుందామని వకుళ ఇంటికి బయలుదేరింది.

వకుళ అత్తయ్యలూ, పెద్దమ్మలూ, శారద తల్లిని కళ్ళప్పగించి చూసారు ముప్ఫైయేళ్ళు దాటాక కూడా, ఇరవై దాటని యువతిలా అసాధారణ సౌందర్యంతో మెరిసిపోతోన్న ఆ లావణ్యరాసిని చూసి ఓర్చలేక పోయారు. గిర్రున ముఖాలు తిప్పుకున్నారు. శారద తల్లి కొద్దిగా చిన్నబుచ్చుకున్నా వెంటనే కూడదీసుకుంది. ఇలాంటివాటికి ఆవిడ బాగా అలవాటు పడిపోయింది. వకుళ తల్లి మాత్రం ''రండి! రండి!'' అని ఆహ్వానించింది. వకుళకు శారద తల్లి



చేసిన సహాయాలు వకుళ తన తల్లితో చెప్పేది. అంచేత ఆవిడపట్ల ఒక విధమైన కృతజ్ఞతా భావం ఉంది.

"వకుళకు పెళ్ళి అని విన్నాను.'' అంది శారద తల్లి సంభాషణ ప్రారంభిస్తూ.

"అవును! మా ఇళ్లల్లో ఆడపిల్లని పెళ్ళి కాకుండా ఎక్కువ రోజులు ఉంచం!" అంది వకుళ తల్లి మూతీ ముక్కూ తిప్పుకుంటూ.

ఆ ధోరణి అర్థమయినా సహించి "పెళ్ళికొడుకు ఏం చేస్తున్నాడూ?" అంది శారద తల్లి సౌమ్యంగా.

''డాక్టరు!'' గర్వంగా అంది వకుళ తల్లి.

శారద తల్లి ఆశ్చర్యపోతూ "ఎంత కట్నం?" అంది.

ఆ ఆశ్చర్యానికి మరింత మిడిసి పడుతూ ''కట్నం ఏమీ లేదు. అమ్మాయిని చూసి కోరి చేసుకుంటానన్నాడు. ఏం? మా అమ్మాయికి కులం తక్కువా? గుణం తక్కువా?"

ఎప్పటికప్పుడు ఎత్తిపొడుపుమాటలు మాట్లాడుతున్న వకుళ తల్లి ధోరణి అర్థమవుతోన్నా వకుళమీది అభిమానంతో సహించి ''ఏ ఊరు? ఎంత వయసు?" అంది శారద తల్లి.

ఈ ప్రశ్నలకు మాత్రం వెంటనే సమాధానం చెప్పలేక పోయింది వకుళ తల్లి. నానుస్తూ "ఈ ఊరే! డాక్టర్ పినాకపాణి '' అంది.

అదిరిపడింది శారదతల్లి... డాక్టర్ పినాకపాణిని ఆ ఊళ్లో తెలియనివాళ్లు లేరు. కొందరు అల్లరిగా డాక్టర్ పీనాసి పాణి అని అంటారు. అంత డబ్బు మనిషి అతను...అతని మొదటిభార్య చచ్చిపోయింది. ఆత్మహత్య చేసుకుందని ప్రచారం చేసారట... కాదు... హత్య అంటారు కొందరు... రెండవ భార్య లేచిపోయింది. ఎక్కడుందో ఏమ

యిందో ఎవరికీ తెలియదు... ఇది మూడవపెళ్ళి.

అక్కడే కూచున్న వకుళ లేత ముఖాన్ని చూస్తోంటే హృదయం ద్రవించింది శారద తల్లికి.

"ఏం వకుళా! నీ కీ సంబంధం నచ్చిందా?" అంది జాలిగా. వకుళ చిరునవ్వుతో "నచ్చింది" అంది.

ఆ చిరునవ్వు చూసి మతిపోయింది శారద తల్లికి.

"నచ్చిందా?" అంది నమ్మలేక.

"ఆ! ఆయన అమ్మనీ, తమ్ముళ్ళనీ, చెల్లాయిలనీ తన దగ్గరే ఉంచుకుంటానంటున్నారు. యేం ఇంక మావయ్యల దగ్గిర ఉండక్కర్లేదు," సంబరంగా అంది వకుళ.

ఆ సంబరాన్ని చూస్తోంటే, ఆ మాటలు వింటుంటే మనసు బాధతో మెలితిరిగిపోయింది శారద తల్లికి.

వకుళ తల్లి రెండు చేతులూ పట్టుకుని "ఇంత దారుణం చెయ్యకండి. అన్యాయంగా ముక్కుపచ్చలారని మీ కూతురి గొంతు మీరే నులమకండి" అంది ఆవేదనతో శారద తల్లి.

అంత పచ్చి నిజాన్ని విని భరించలేకపోయింది, వకుళ తల్లి...శారద తల్లి చేతులను విదిలించికొట్టి "డబ్బుకోసం వొళ్ళమ్ముకోవడంకంటె ఇది నయమే!" అంది.

నిర్ఘాంతపోయింది శారద తల్లి... అక్కణ్నుంచి లేచి వచ్చేసింది. వకుళ పరుగున వచ్చి వీధి గుమ్మంలో ఆవిణ్ణి కలుసుకుని రెండు చేతులూ జోడించి "ఏమీ అనుకోకండి! పాపం, మా అమ్మ, మా నాన్న వొదిలేసిన దుఃఖంలో మతిలేకుండా మాట్లాడుతుంది," అంది.

శారద తల్లి క్షణకాలం ఆగి వకుళ శిరసు ఆప్యాయంగా నిమురుతూ "పిచ్చి పిల్ల!" అని కదిలిపోయింది.

ఒకప్పుడు కన్యాశుల్కాలుండేవి! ఆ రోజుల్లో డబ్బుకోసం తలిదండ్రులే పసిపిల్లలను ముసలివాళ్ళ కిచ్చి పెళ్ళిళ్ళు చేసేవారు.

సంఘసంస్కర్తల మహత్తర ప్రయత్నాలకు ఫలితంగా ఆ దురాచారం పోయింది.

వరకట్నా లొచ్చాయి.

తలిదండ్రులు కట్నా లివ్వకోలేక తమ కూతుళ్ళను ఎవరికో ఒకరికి కట్టబెడుతున్నారు.

ఏ ఆచారాలు ఎలా మారినా బలి అవుతున్నది మాత్రం స్త్రీలే!

ఈనాడు ముక్కుపచ్చలారని వకుళను ఆదుకోగలిగిన వాళ్ళెవరు?

అంతర్జాతీయ మహిళా సంవత్సరమన్నారు. మహిళా మహోదయ మంటున్నారు! ఎక్కడ ఆ మహిళా మహోదయం! రవీంద్ర భారతిలోనా?

వకుళకు పెళ్ళయిపోయింది. మొదటిసారిగా భర్త దగ్గిరకు వెళ్ళివచ్చిన వకుళ మనసులో మిగిలినవి భరింపరాని చీదర, జుగుప్స మాత్రమే!

"ఇదా, పెళ్ళంటే! అందరూ పెళ్ళిళ్ళు ఎలా చేసుకుంటున్నారు!" అని ఆశ్చర్యపోయింది భయంతో శరీరం వణుకుతుండగా, ఆ పసిపిల్ల.

ఆ మరునాడు భర్త దగ్గిరకు వెళ్ళలేక తల్లి పక్కన పడుకుంది వకుళ...వకుళ అవస్థను అర్థంచేసుకున్న తల్లి జాలితో వకుళను బుజ్జగింపుతో జోకొడుతూ తన దగ్గిరే పడుకోబెట్టుకుంది.

ఆకొన్న సింహంలా తిరిగాడు డాక్టర్ పినాకపాణి..."వకుళా!" అని గర్జిస్తున్నట్లుగా పిలిచాడు. వకుళ మరింతగా వణికిపోతూ తల్లిని మరింత గట్టిగా కరచుకుంది.

చేసేదిలేక అప్పటికి ఊరుకున్నాడు పినాకపాణి ... కానీ, అలా భర్తను ఎక్కువకాలం తట్టుకోలేకపోయింది వకుళ.

"వకుళా! తమ్ముడికి జీతం కట్టాలి. కాస్త మీ ఆయన్నడుగు!" అంది వకుళ తల్లి.

వకుళకు శరీరంలో రక్తం నీరయిపోతోంది. అయినా "అడగను" అనలేకపోయింది తల్లితో ... పాపం, తమ్ముడు చదువుకోవద్దూ!"

భయపడుతూ భయపడుతూ అడిగింది భర్తను.

"తమ్ముడికి జీతం కట్టాలి!"

చీదరించుకుంటూ చూశాడు డాక్టర్ పినాకపాణి.

"ఛ! వెధవ సంత! బోలెడు కట్నంతో లెక్కలేనన్ని సంబంధాలు వస్తూంటే నేరకపోయి ఈముష్టిసంబంధం చేసుకున్నాను."

శరీరం అణువణువూ దహించుకుపోతోంటే తలవంచుకు నిలబడింది వకుళ.

"ఇంద తీసుకో!"

పదిరూపాయల కాగితం అందించాడు దాన్ని అందుకోబోయిన వకుళచేతిని పట్టుకుని మీదికి లాకున్నాడు, కిక్కురుమనలేదు వకుళ...ఏంచెయ్యాలో, ఎలా ప్రతిఘటించాలో కూడా అర్థంకాక బలి పశువులా ఉండిపోయింది.

పదిరూపాయలు! ఒక్క పదిరూపాయలు! ఆ కాగితాన్ని తల్లిచేతిలో పెట్టి బాత్‌రూంలోకి వెళ్ళి కుళ్ళి కుళ్ళి ఏడ్చింది.

ఆ కుటుంబపు అవసరాలు అక్కడితో ఆగేవికావు. ఎప్పుడూ ఏదో ఒకటి.

ఒకసారి తల్లికి కీళ్లనొప్పులెక్కువవుతాయి. డాక్టర్‌కి చూపించుకోవాలి!

మరొకసారి చిన్న చెల్లెలు పుట్టిన రోజు. కొత్త బట్టలు కొనాలి! పేరంటం కూడా చెయ్యాలి.

ఇలాగే ఏదో ఒకటి...అన్నింటికీ వకుళ తన భర్తను అడగవలసిందే!

ఎప్పుడు అడిగినా అతడు చీదరించు కోక మానడు! చిన్నబుచ్చక మానడు! అడిగినంత ఇయ్యకపోయినా, ఎంతో కొంత తోచినంత ఇస్తాడు. ఇచ్చిన దానికి పదిరెట్లు వకుళను చిత్రవధ చేస్తాడు.

వకుళకు నెల తప్పింది. తల్లి పరమానందంతో సీమంతంచేసింది...ఎంతో చురుగ్గా ఉండే వకుళ—ఏమీ చదవకపోయినా, క్లాస్‌లో ఫస్ట్ మార్కులు తెచ్చుకునే వకుళ ... ఆలోచించటం పూర్తిగా మానేసింది. యాంత్రికంగా ఎవరేం చెబితే అది చెయ్యటమే అలవాటు చేసుకుంది. కడుపుతో ఉన్నా వకుళకు భర్త దగ్గరకు పోక తప్పలేదు. కుటుంబపు ఇబ్బంది అలాంటివి!

లేత వయసులో కాన్పు రావటంవల్ల వకుళకు చచ్చి బ్రతికినంత పనయింది. ...తన ప్రక్కన పడుకున్న తన కూతుర్ని చూస్తొంటే ఆడుకోవటానికి మంచి బొమ్మ దొరికినప్పుడు పసిపిల్లకు కలిగే ఉత్సాహంలాంటిది కలిగింది ఒక్క క్షణం. అంతలోనే శరీరబాధలో ఆ ఉత్సాహంకూడా కరిగిపోయింది.

ప్రసవమయి రెండు నెలలయినా వకుళ కోలుకోలేదు. పసిగుడ్డును వకుళ తల్లి సాకుతోంది. మంచంమీంచి లేస్తే కళ్ళు తిరిగి పడిపోతోంది వకుళ.

హైస్కూల్లో పిల్లలందరూ ఎక్స్‌కర్షన్‌కి వెళ్తున్నారట! వకుళ తమ్ముడు కూడా వెళ్తానని పేచీ మొదలుపెట్టాడు. మొదట వకుళ తల్లి కొడుక్కి నచ్చచెప్పబోయింది. కానీ అతడు మొండిగా ఏడుస్తొంటే, "పోనీ, వకుళా, మీ ఆయన్ని అడుగుతావుటే!" అంది.

మాట్లాడటానికి ఓపికలేని వకుళ "అలాగే!" అన్నట్లు తల ఊపింది ... తూలుతూ తూలుతూ లేచివెళ్లి భర్తను అడిగింది.

"మా తమ్ముడు ఎక్స్‌కర్షన్‌కి వెళ్తాట్ట! డబ్బుకావాలి!"



"డబ్బు! డబ్బు! డబ్బు! మీ కందరికీ విరజిమ్మడానికి నే నిక్కడ రాసులు పోసుకుని కూచోలేదు. ఇప్పటికే నీ తెగులు మూలంగా ఎంత ఖర్చుపెట్టానో తెలుసా? ఛ! ఛ! ప్రాణానికి సుఖం లేదు!"

వకుళకు మాట్లాడే ఓపిక లేకపోయింది. ఓపిక ఉన్నా మాట్లాడగలిగేది కాదు.

"ఊ!, ఇంద తీసుకో!" ఎప్పటిలా డబ్బు తీసి అందించాడు.

జంకుతూనే అందుకోబోయింది. ఆ చెయ్యి పట్టుకుని మీదకు లాక్కున్నాడు.

కెవ్వున కేక పెట్టింది. పినాకపాణి ఆ కేకలను లక్ష్యపెట్టలేదు.

వకుళ తల్లికి హృదయ విదారకంగా వకుళ పెట్టే బొబ్బలు వినిపిస్తోనే ఉన్నాయి. ఏం చెయ్యాలో పాలుపోలేదు.

తలుపులు దబదబ బాదింది. పావుగంటకి కాని ఆ తలుపులు తెరుచుకోలేదు. తలుపులు తీసుకుని విసురుగా వెళ్ళిపోయాడు పినాకపాణి.

మంచంమీద స్పృహలేకుండా వకుళ ...ఆ మంచం ప్రక్కనే క్రింద రెండు పదిరూపాయల నోట్లు.

"వకుళా!" అంటూ తల్లి ఏడుస్తూ కుదిపింది. వకుళ కళ్ళుతెరిచి అంతలో మూసుకుంది...ఆ రోజే వకుళకు రక్తస్రావం ఆరంభమయింది. వెంటనే హాస్పిటల్లో చేర్పించారు. అయినా ప్రయోజనం లేకపోయింది. ఆ రాత్రికే వకుళ శాశ్వతంగా కళ్ళు మూసింది.

పసిగుడ్డును వళ్లో వేసుకుని కూతురి శవం ముందు కూచుని కుమిలి కుమిలి ఏడుస్తోన్న వకుళ తల్లిని చూస్తొంటే ఎంత జాలికలిగిందో, అంత కోపం కూడా వచ్చింది శారద తల్లికి.

"ఎందు కంతగా ఏడుస్తారు? ఊరుకోండి! ఒక పదేళ్ళు కళ్ళు మూసుకున్నారంటే, మీ మనవరాలు ఎదిగిపోతుంది. అప్పుడు మంచి సంబంధం చూసి పెళ్ళిచేసి మీరంతా సుఖంగా ఉండొచ్చు! నీచంగా డబ్బుకోసం వొళ్లమ్ముకోవటం కాదు! పవిత్రంగా పెళ్ళిచెయ్యటం!"

పెళ్ళి! పెళ్ళి! పవిత్రమైన పెళ్ళి

సంఘంమీద..సంఘంలో మనుష్యుల మీద, సంఘం ఏర్పరిచిన అర్థంలేని ఆచారాలమీద...ఆ ఆచారాలు సంస్కరించుకోలేని మనుష్యుల బలహీనత మీద ...కసితో మనసు భగ్గుమనగా అక్కడ నిలవలేక పారిపోయింది శారద తల్లి.